# పోలిక

కొఠారి వాణీచలపతిరావు



ఆఫీసు నుండి ఇంటికి వస్తూనే భార్యవాలకం చూసి నిరాశగా పెదవి విరిచాడు రఘుపతి.

సోఫాలో కూర్చొని సీరియస్‌గా ఏదో పుస్తకం చదువుతున్నట్లు నటిస్తూ తన రాకను పట్టించుకోలేదు వసుంధర.

ఆమె పక్కనే కూర్చుని 'ఇష్' అని బలంగా గాలివదులుతూ చాలా అలసిపోయి వచ్చినట్లు తనూ నటించాడు రఘుపతి.

అయినా ఆమెలో చలనం లేదు

'కాసిని చల్లటి మంచినీళ్ళిస్తావా!' అన్నాడు కావాలని పలకరిస్తూ.

“మీరుకొన్న ఫ్రిజ్‌లు, వాటర్‌కూలర్లు ఇంట్లో ఉన్నాయని చల్లటి మంచినీళ్ళిస్తాను” అని ఓ గ్లాసుడు వేడినీళ్ళు విసురుగా టీపాయ్‌మీద పెట్టింది వసుంధర.

'చల్లటి' అన్నమాటను ప్రయోగించడంలో తనెంతటి తప్పుచేశాడో అప్పుడు గ్రసించుకున్నాడు రఘుపతి 'ఏమిటో' పాడు బుర్ర ఒక్కోసారి బొత్తిగా పనిచేయదు' ఉదయం వసుంధరకు కోపం తెప్పించింది ఈ ఫ్రిజ్ ప్రస్తావనే కదా. నిన్న అనుకోకుండా ఆఫీసులో ఏడు వేల ఐదువందలు ఏరియర్స్ దొరికాయి. ఆ సంతోషాన్ని వసుంధరతో కలిసి పంచుకోవాలని ఓ అరకిలో స్వీట్, ఓ కొత్తచీర తెచ్చి శుభవార్త వినిపించాడు రఘుపతి. డబ్బు వచ్చిందనగానే ఎగిరిగంతేస్తూ 'అయితే మనం ఫ్రిజ్' కొందామండీ అంది వసుంధర. రఘుపతి గుండెల్లో రాయిపడింది.

ఎన్నో తీర్చాల్సిన చేబదుళ్ళు ఉన్నాయి. అవి తీర్చేసి మిగిలిన ఐదు వేలు ఫిక్స్‌డ్ చేస్తే భవిష్యత్తులో మళ్ళీ అప్పులు చెయ్యకుండా పిల్లల చదువులకు పనికొస్తాయని అనుకున్నాడు. ఆ విషయమే భార్యతో చెబితే ఛీ! ఛీ! ఎప్పుడూ దరిద్రమే! పాడుకొంప! ' ఏ అచ్చటా ముచ్చటాలేదు' అని రుసరుసలాడి కళ్ళనీళ్ళపర్యంతం అయింది. “ఇప్పుడు ఫ్రిజ్ లేకుంటే వెళ్ళటం లేదా వసూ! ఎంచక్కా కొత్తకుండలో చల్లటి నీళ్ళుతాగుతున్నాం” అన్నాడు సర్దిచెప్పే ధోరణిలో “ఫ్రిజ్ ఉపయోగం అందుకే కాదు. ఇంకా చాలా వాటికి ఉపయోగిస్తారు. ఈ రోజుల్లో ఎవరింట్లో చూసినా ఫ్రిజ్, టి.వి, ఎయిర్‌కూలర్ కామన్‌థింగ్స్ అయిపోయాయి. మనింట్లోనే ఏదీ లేదు. అయ్యవారి నట్టిల్లులా ఉంది. ఇంటి కెవరన్నా వస్తున్నారంటే సిగ్గేస్తున్నది అన్నది కోపం, చిరాకు ప్రదర్శిస్తూ వసుంధర మనస్తత్వం తెలుసు గనుక మరి మాట్లాడ లేదు రఘుపతి. ఆమెకు ఫర్నిచర్ అంటే చాలామోజు 'వాళ్ళింట్లో అదుంది. వీళ్ళింట్లో ఇదుంది' అంటూ ఇతరులతో పోల్చుకొని బాధపడిపోతూ ఉంటుంది. ఇక తన ప్రయత్నాలు సాగవని రేపెలాగయినా ఫ్రిజ్ పట్టుకునే ఇంటికి రావాలని మౌనంగా బాల్కనీలో నిల్చుని వచ్చేవాళ్ళను, పోయేవాళ్ళను చూస్తూ ఉంది.

అప్రయత్నంగా ఆమె దృష్టి ఇంటికెదురుగానున్న ఒక గుడిసె మీద పడింది. ఆ గుడిసె ముందు చినిగిన గళ్ళలుంగీ కట్టుకున్న ఒక వ్యక్తి 4, 5 సంవత్సరాల ఒక కుర్రవాడ్ని కర్రదీసుకొని బాదుతున్నాడు 'వద్దయ్యా! కొట్టద్దయ్యా! అని వాడు విలవిలలాడిపోతున్నాడు. నీకు మూడు పూటల కూడు కావాలంటే యాడికెళ్లి తేనురా! అని ఆ వ్యక్తి కోపం చేస్తుంటే, అడగవయ్యా! కొట్టకయ్యా! అని వాడు ప్రాధేయపడుతున్నాడు.

'అన్నానికి కూడా నీళ్ళు నోచుకోలేదా' అని వసుంధర హృదయం జాలితో నిండిపోయింది. ఆ దృశ్యం తాలూకు విషాదఛాయలు ఇంకా ఆమె హృదయాన్ని వీడకముందే మరోదృశ్యం ఆమె కంటబడింది.

వయసులో ఉన్న ఒక అందమైన అమ్మాయి...

చేతికర్ర సాయంతో తడుముకుంటూ నడుస్తున్నది. ఆమె రెండు కళ్ళస్థానంలో రెండు గుంటలున్నాయి. రోడ్డు దాటించమని ఒక కుర్రవాణ్ణి ప్రాధేయపడుతున్నది.

ఈ ప్రపంచమంతా ఒక్కసారి తన కళ్ళ ముందు నిల్చినట్లు అనిపించింది వసుంధరకు జీవితంలో అత్యంత అవసరమైన 'కళ్ళు, కాళ్ళు' లేనివాళ్ళు, కడుపునిండా తిండి లేనివాళ్ళు ఉండగా అన్నీ ఉండి నిత్యం ఏదో లేనట్లు తను బాధపడుతూంది. అర్థంలేని ఈ కోర్కెలకు అంతమెక్కడ? పిండికొద్దీ రొట్టె, చెట్టుకొద్దీ గాలి' అన్న జీవితసత్యాలను తనెలా మర్చిపోయింది అనుకుంది వసుంధర. చల్లటి షర్బత్ అందిస్తూ “ఏమండీ! అప్పులు తీర్చి అయిదువేలు వెంటనే ఫిక్స్‌డ్ చేయండి” అంటున్న భార్యవంక ఆశ్చర్యంగా చూశాడు రఘుపతి.